సాక్షి నిజామాబాద్

సోమవారం । 18 । ఆగస్టు । 2025



చెరువు నిండదు..

ఎస్సారెస్పీ పక్కనే ఉన్నా మెండోరా మండలం సోన్‌పేట్ గ్రామ చెరువుకు చుక్క నీరందడం లేదు. వర్షపునీరే చెరువుకు దిక్కు.

- 8లో ▸



భరోసా లేని గీతన్నల..

గీత కార్మికులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. సరైన ఉపాధి లేక బతుకు దెరువు కోసం ఇతర పనులు చేస్తున్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
27.9 /22.4

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. మధ్యాహ్నం వేళ భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

తెలంగాణ ప్రోకబడ్డీ చీఫ్ కోచ్‌గా ప్రశాంత్



నిజామాబాద్ నాగారం: తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ సహకారంతో ఈ నెల 27 నుంచి హైదరాబాద్‌లో యువ ప్రోకబడ్డీ లీగ్ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో ఎనిమిది జట్లు పాల్గొననుండగా, శాతవాహన సైనికులు జట్టుకు చీఫ్ కోచ్‌గా జిల్లాకు చెందిన మీసాల ప్రశాంత్ నియామకం అయ్యారు. ప్రశాంత్ ప్రస్తుతం జిల్లా స్పోర్ట్స్ అథారిటీలో కబడ్డీ కోచ్‌గా వి. ధులు నిర్వర్తిస్తున్నారు. ప్రోకబడ్డీ జట్టుకు కోచ్‌గా ఎంపికైన ప్రశాంత్‌ను జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు అంద్యాల లింగయ్య, కార్యదర్శి గంగాధర్ రెడ్డి, కోశాధికారి సురేందర్, వైస్ ప్రెసిడెంట్ శ్రవణ్ రెడ్డి, బొబ్బిలి నర్సయ్య, రాజకుమార్, గంగారెడ్డి, రాజేందర్, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, హైదర్ అలీ, హరిచరణ్, అనురాధ, జ్యోతి, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

ఎస్సారెస్పీ ఎస్ఈగా జగదీశ్

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్‌గా జగదీశ్ రానున్నారు. కంతనపల్లి ప్రాజెక్ట్ ఈఈగా పని చేస్తున్న ఆయనకు పదోన్నతి లభించింది. ఎస్సారెస్పీ ఇన్‌చార్జి ఎస్ఈగా ఏడాదిపాటు శ్రీనివాస్‌గుప్తా పని చేశారు. నూతన ఎస్ఈ సోమవారంబాధ్యతలు స్వీకరిస్తారని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

19న డైట్‌లో స్పాట్ అడ్మిషన్లు



నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వ, ప్రైవేటు డైట్ కళాశాలల్లో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశపరీక్ష రాసి అర్హత పొందిన అభ్యర్థులకు వివిధ దశల్లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయ్యిందని పేర్కొన్నారు. ఈ నెల 19న ఉదయం 10 గంటల నుంచి డైట్ కళాశాలలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ప్రైవేట్ డైట్ కళాశాలలో సీటు పొందాలనుకునేవారు 20వ తేదీన హాజరుకావాలని సూచించారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి



నిజామాబాద్ సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నిర్లక్ష్యం చేశాయని, వాటిని అమలు చేయాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్రి ప్రసాద్ డిమాండ్ చేశారు. నగరంలోని నాందేవ్‌వాడలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తానని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. గుడిసెలు వేసుకొని జీవిస్తున్న వారికి పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. గృహలక్ష్మి పథకం ప్రతి మహిళకు అందించాలన్నారు. రూ. 500 గ్యాస్ సిలిండర్ కూడా చాలా మందికి రావడం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు, నగర కార్యదర్శి బెజుగం సుజాత, రాములు, నర్సయ్య,అనసూయ, నరేశ్, దీపిక, అనిత పాల్గొన్నారు.




గోధుమ కుంట మొక్కజొన్న గుట్ట

మోపాల్ మండలం కాల్పొల్ తండాలోని గోధుమ కుంట(చెరువు) చెంతనే ఉన్న గుట్ట మొక్కజొన్న సాగుతో కళకళలాడుతోంది. పోడు వ్యవసాయం చేస్తున్న స్థానిక రైతులు గుట్టపై మొక్కజొన్న పండిస్తున్నారు. ముందు ప్రాంతంలో నీటితో గోధుమ కుంట.. పచ్చని మొక్కజొన్నతో దానికి అనుకుని ఉన్న గుట్ట.. కనువిందు చేస్తున్నాయి. గుట్ట, నీటి కుంట ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

వరద ఉధృతి



వరద కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీరు

- ఎగువ నుంచి ఎస్సారెస్పీలోకి లక్షా 43 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- వేగంగా పెరుగుతున్న ప్రాజెక్ట్ నీటి మట్టం
- ఇన్‌ఫ్లో కొనసాగితే గేట్లు ఎత్తే అవకాశం!
- ప్రజలు జాగ్రత్తగా ఉండాలంటున్న ప్రాజెక్ట్ అధికారులు

ఉమ్మడి జిల్లాలోని నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులు నిండు కుండల్లా మారాయి. ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద వస్తుండడంతో నిజాంసాగర్ గేట్లను సోమవారం ఉదయం ఎత్తివేయనున్నట్లు సంబంధిత అధికారులు ప్రకటించగా, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఏ సమయంలోనైనా ఎత్తే అవకాశం ఉంది. మంజీర, గోదావరి పరీవాహక ప్రాంతాల రైతులు, పశువులకాపర్లు అప్రమత్తంగా ఉండాలని, నదులవైపు వెళ్లొద్దని అధికారులు సూచిస్తున్నారు. అలీసాగర్ రిజర్వాయర్ గేట్లను ఏక్షణానైనా ఎత్తే అవకాశం ఉంది.



ఎస్సారెస్పీ ప్రస్తుత నీటి నిల్వ

బాల్కొండ: మహారాష్ట్ర ప్రాంతంలోని ప్రాజెక్టుల నుంచి మిగులు జలాలు వదలడంతో గోదావరికి వరద పోటెత్తింది. దీంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి శనివారం మధ్యాహ్నం నుంచి లక్షా 5 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. అర్ధరాత్రి సమయానికి లక్షా 30 వేలకు చేరింది. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో లక్షా 52 వేల క్యూసెక్కులకు పెరిగింది. అప్పటి నుంచి రాత్రి వరకు ఇన్‌ఫ్లో నిలకడగా ఉంది. 10 గంటల సమయంలో లక్షా 43వేలకు తగ్గింది. ప్రాజెక్ట్ నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. మహారాష్ట్రలోని గైక్వాడ్ ప్రాజెక్ట్ 92 శాతం నిండిందని, అక్కడి నుంచి మిగులు జలాలు విడుదల చేస్తే వరద మరింత పెరిగే అవకాశం ఉందని ఎస్సారెస్పీ అధికారులు పేర్కొంటున్నారు.

ఇన్ ఫ్లో కొనసాగితే..

ఎస్సారెస్పీలోకి ప్రస్తుతం లక్షా 43వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. సోమవారం మధ్యాహ్నం వరకు ఇలాగే ఉంటే గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదల చేసే అవకాశం ఉంటుందని ప్రాజెక్టు అధికారులు అంటున్నారు. గంటకు 0.5 టీఎంసీల వరద నీరు వచ్చి చేరుతుండగా.. ప్రస్తుతం 67 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సోమవారం ఉదయం 6 గంటల వరకు ఇన్‌ఫ్లో నిలకడగా లేదా పెరిగినా మరో 6 టీఎంసీలు నీరు చేరి నీటి మట్టం 72 టీఎంసీలకు చేరుతుంది. గత రెండేళ్లుగా 70 టీఎంసీలు దాటగానే వరద గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. బ్యాక్ వాటర్ ప్రాంతంలో నీరు ఎక్కువగా నిలిచి గ్రామాల్లోకి చేరుతోందనే కారణంతో 10 టీఎంసీల నీరు తక్కువగా ఉండగానే గేట్లను ఎత్తుతున్నారు. ఈ ఏడాది కూడా అలాగే నీటిని వదిలేందుకు ప్రాజెక్ట్ అధికారులు సిద్ధమవుతున్నారు.

వరద కాలువ ద్వారా నీటి విడుదల..

వరద కాలువ ద్వారా అధికారులు ఆదివారం నీటి విడుదల చేపట్టారు. ముందుగా 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసి క్రమంగా 10 వేల క్యూసెక్కులకు పెంచారు. కాకతీయ కాలువకు 4 వేల క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్‌కు 180 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు. ఆవిరి రూపంలో 594 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం రాత్రి వరకు 1087.40(67.63 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

నది వైపు వెళ్లొద్దు

ఎగువ నుంచి వరద ఉధృతంగా వస్తున్న నేపథ్యంలో గేట్లు ఎత్తే అవకాశం ఉందని, పశువుల కాపర్లు, రైతులు గోదావరి వైపువెళ్లొద్దని ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాస్‌గుప్తా హెచ్చరించారు. గోదావరి పరీవాహక ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జిల్లా వ్యాప్తంగా 27.9 మి.మీ. వర్షం

నిజామాబాద్ అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం రోజున 27.9 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. శనివారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటలవరకు వర్షం కురిసింది. డొంకేశ్వర్‌లో 59.3, ఆలూర్ 38.3, నందిపేట 60.1, నవీపేట 48.1 , బోధన్ 33.0, ధర్పల్లి 29.9, పొతంగల్ 29.5, రెంజల్ 39.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

అలీసాగర్ అప్రమత్తం

బోధన్: ఎడపల్లి మండలం జానకంపేట్ గ్రామ శివారులోని అలీసాగర్ రిజర్వాయర్ వరద గేట్లను ఏ క్షణానైన ఎత్తే అవకాశం ఉంది. నిజాంసాగర్ ప్రాజెక్టు డి–50 ప్రధాన కాలువలోకి నీటిని వదిలేందుకు నీటిపారుదల శాఖ అధికారులు సిద్ధమయ్యారు. అలీసాగర్ రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి భారీగా వరద వస్తుండడంతో ఎప్పటికప్పుడు పరిస్థితి అంచనా వేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 1299.6 ఫీట్లు కాగా, ఇప్పటి వరకు 1297 ఫీట్ల వరకు నీరు చేరిందని, మరో ఫీటు మేర నీటి నిల్వ పెరిగితే గేట్లు ఎత్తాల్సి వస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఎడపల్లి, రెంజల్, నవీపేట మండలాల్లో డి–50 కాలువ విస్తరించి ఉన్నందున పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఉప్పొంగుతున్న గోదావరి

రెంజల్(బోధన్): జిల్లాతోపాటు ఎగువ మహారాష్ట్రలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరితోపాటు మంజీరా, హరిద్ర నదుల నుంచి వరద ఉప్పొంగుతోంది. దీంతో కందకుర్తి పుష్కరక్షేత్రం వద్ద నదిలోని పురాతన శివాలయం పూర్తిగా నీటమునిగింది. అంతర్రాష్ట్ర వంతెనను ఆనుకొని వరద ప్రవహిస్తోంది. రెంజల్ ఎస్సై చంద్రమోహన్‌తోపాటు ఇన్‌చార్జి తహసీల్దార్ ఆసియా ఫాతిమా వరద ప్రవాహం నేపథ్యంలో గోదావరి పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రచారం చేయించారు.



అంతర్రాష్ట్ర రహదారి వంతెనను ఆనుకొని ప్రవహిస్తున్న వరద

నిజాంసాగర్‌కు భారీ వరద

- 90 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకున్న జలాశయం



నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం

నిజాంసాగర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు నిండు కుండలా మారుతోంది. ఎగువన ఉన్న పోచారం ప్రాజెక్టుతో పాటు హల్దీవాగు, ఘనపురం ఆనకట్ట, మంజీర నది, సింగూరు ప్రాజెక్టుల ద్వారా ఆదివారం అర్ధరాత్రి 90వేల క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లోగా వస్తోంది. దీంతో ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరువవుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8టీఎంసీలు కాగా.. ఆదివారం రాత్రి వరకు 1,402.37 అడుగుల (14.162 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం అర్ధరాత్రి తరువాత గేట్లు ఎత్తే అవకాశం ఉందని నీటి పారుదలశాఖ ఈఈ సోలోమాన్ తెలిపారు. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సోమవారం ప్రాజెక్టును సందర్శించనున్నారు.

పర్యాటకుల సందడి

బాల్కొండ: ఎస్సారెస్పీకి భారీ వరద వస్తుండడంతో ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో వేల సంఖ్యలో పర్యాటకులు వచ్చి ఉల్లాసంగా గడిపారు. ఆనకట్ట పైకి కార్లు, ద్విచక్ర వాహనాలు వందల సంఖ్యలో రావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. కనీస సౌకర్యాలు లేవని, అడ్డూఅదుపు లేకుండా వాహనాలు తిరుగుతున్నాయని పలువురు పర్యాటకులు విస్మయం వ్యక్తం చేశారు.



ఎస్సారెస్పీ ఆనకట్టపై పర్యాటకులు

బీసీలు ఐక్యతతో ముందుకు సాగాలి

- రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్‌రెడ్డి డ్రామా
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్లన్న

నిజామాబాద్‌రూరల్/డిచ్‌పల్లి: ఐక్యతతో ముందుకు సాగాలని, 2029లో బీసీలదే రాజ్యాధికారమని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం డిచ్‌పల్లి మండలం బర్ధీపూర్ శివారులోని హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. బీసీ ఉద్యమానికి నిజామాబాద్ జిల్లా నాంది పలుకుతుందన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎమ్మెల్యే టికెట్లను అధికంగా అగ్రవర్ణాల వారికి కేటాయించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని విమర్శించారు. ఉమ్మడి జిల్లాలో 25 లక్షలకు పైగా బీసీ జనాభా ఉంటే ఒక్క బీసీ ఎమ్మెల్యే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యేగా బీసీకి చెందిన గంప గోవర్ధన్ ఉండగా, ఆ ఒక్క సీటును కేసీఆర్ లాక్కున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి 42 శాతం బీసీల రిజర్వేషన్ పేరిట డ్రామా ఆడుతూ, ధర్నాలు చేస్తున్నారని మండిపడ్డారు.

బీసీలు కలిసికట్టుగా ఉండాలి

బీసీ ఓట్లతో గెలిచి సీఎంగా రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, 15శాతం ఉన్న ఓసీలకు చిత్తశుద్ధి ఉంటే సీఎంతో సహా అందరూ రాజీనామా చేసి బీసీలకు రాజ్యాధికారం ఇవ్వాలని మల్లన్న డిమాండ్ చేశారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో అత్యధిక ఎంపీటీసీలు, సర్పంచులు, జెడ్పీటీసీ స్థానాలను సాధించుకునేలా బీసీలు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. సమావేశంలో తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ సుదగాని హరిశంకర్ గౌడ్, సమన్వయకర్తలు వట్టె జానయ్య యాదవ్, భీమగాని సిద్ధులుగౌడ్, సంగెం సూర్యారావు, బుస్సాపూర్ శంకర్, బీసీ జేఏసీ నాయకులు బాస రమేశ్ యాదవ్, రమేశ్ పటేల్, డి.నరేందర్, సతీశ్ గౌడ్, తాళ్లపల్లి చంద్రశేఖర్, ప్రవీణ్ ముదిరాజ్, జ్యోతి, రేఖ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

‘తక్షణ స్పందన.. ప్రాణాలకు రక్షణ’

- రోడ్డు ప్రమాదాల్లో తొలి గంటే కీలకం
- సీపీఆర్, ప్రథమ చికిత్సతో ప్రాణాలు నిలిపే అవకాశం

ఖలీల్‌వాడి: ‘ఒక్క గంట ముందు వచ్చి ఉంటే ప్రాణాలు కాపాడేవాళ్లం’ అనే మాటలు డాక్టర్ల వెంట తరచూ వింటూ ఉంటాం. రోడ్డు ప్రమాదాలు, విద్యుదాఘాతాలు, పాముకాట్లు తదితర ఘటనలు జరిగిన తర్వాత తక్షణమే స్పందించకపోవడంతో చాలా మంది ప్రాణాలు కోల్పోవడం, జీవితాంతం క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు. ఎలాంటి ప్రమాదం జరిగినా సమీపంలో ఉండే వారు తక్షణమే స్పందించి తగిన చర్యలు చేపడితే ప్రాణాలు నిలిపే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

ప్రథమ చికిత్సే ప్రధానం..

- చాలా ప్రమాదాల సమయంలో ప్రథమ చికిత్సలు ప్రాణాలను కాపాడుతాయి. ఇటీవల వీధి కుక్కలు దాడి చేసి పిల్లలు, పెద్దలను గాయపర్చిన ఘటనలు జిల్లాలో చోటు చేసుకున్నాయి. కుక్క కరిచిన చోట సబ్బుతో బాగా శుభ్రం చేసి కట్టుకట్టాలి. అనంతరం ఆస్పత్రికి తరలించి తగిన చికిత్స పొందాల్సి ఉంటుంది.
- వర్షాకాలంలో రైతులు పాముకాటుకు గురయ్యే అవకాశం ఉంటుంది. పాము కరిచిన వెంటనే కాటు వేసిన ప్రాంతంలో దారంతో గట్టిగా కట్టాలి. దీంతో పాము విషం శరీరంలోకి వ్యాప్తి చెందే అవకాశం తగ్గుతుంది. అనంతరం ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందితే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు.



గోల్డెన్ అవర్

జిల్లాలో గత మూడేళ్లలో సుమారు 944లకు పైగా రోడ్డు ప్రమాదాలు సంభవించగా ఇందులో 1012 మందికి పైగా మృత్యువాత పడ్డారు. మరో 2183 మందికి పైగా క్షతగాత్రులుగా మిగిలారు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారిని గంటలోపే ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రక్తస్రావం, ఎముకలు విరగడం లాంటివి జరిగినప్పుడు అంబులెన్స్ కోసం వేచిచూడకుండా ఇతర మార్గాల ద్వారా ఆస్పత్రికి తరలించాలని సూచిస్తున్నారు.

సీపీఆర్..

రోడ్డు ప్రమాదాలు, గుండెపోటు బాధితులకు పక్కన ఉండేవారు సీపీఆర్(కార్డియో పల్మనరీ రిససిటేషన్) చేసి ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చు. సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

ఆస్పత్రికి తరలించాలి

ఎలాంటి ప్రమాదం జరిగినా సమీపంలో ఉన్న వారు తక్షణమే స్పందించి ఆస్పత్రికి తరలించాలి. క్షతగాత్రుడిని త్వరగా తీసుకువస్తే ప్రాణాలను రక్షించే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ శంభు, ఎంఎస్ ఆర్థోపెడిక్, నిజామాబాద్

క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చాలి

- డీవైఎస్‌వో పవన్‌కుమార్
- ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ప్రాబబుల్స్ ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో డీవైఎస్‌వో పవన్‌కుమార్

నిజామాబాద్ నాగారం: రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని డీవైఎస్‌వో పవన్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా క్రీడా మైదానంలో ఆదివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ మహిళా, పురుషుల జట్టు ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీవైఎస్‌వో పవన్‌కుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. క్రీడాకారులు నైపుణ్యాలను ప్రదర్శించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. తాను కూడా మొదట బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడినేనని గుర్తు చేశారు. అనంతరం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్ మాట్లాడుతూ బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు పూర్వవైభవం తీసుకొచ్చేలా జిల్లా సంఘం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో పతకాలు సాధిస్తుందన్నారు. జిల్లా క్రీడా మైదానంలో బాల్ బ్యాడ్మింటన్ కోర్టుకు స్థలాన్ని కేటాయించాలని ఈ సందర్భంగా కోరారు. ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించి తుది జట్టును ఎంపిక చేస్తామన్నారు. వారు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో జరిగే 71వ రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో బాల్‌బ్యాడ్మింటన్ కామారెడ్డి జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి రాజేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగేష్, కార్యవర్గ సభ్యులు భాగ్యశ్రీ, గీత, సింధూజ, సీనియర్ క్రీడాకారులు ఆనంద్, కార్తిక్, సాయికుమార్, పూజ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంబులెన్సులో ప్రసవం



పెర్కిట్: ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన రవిత ఆదివారం 108 అంబులెన్సులో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మచ్చర్లకు చెందిన రవిత ఆదివారం కాన్పు నొప్పులు అధికం కావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. అంబులెన్సు సిబ్బంది గ్రామానికి చేరుకుని ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో శిశువుకు జన్మనిచ్చింది. అంబులెన్సు సిబ్బంది ప్రథమ చికిత్సలు అందించి దేగాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా తల్లి, బిడ్డలు క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అంబులెన్సు సిబ్బంది రమేశ్, శాంత, ఆశా వర్కర్ పుష్పకు కృతజ్ఞతలు తెలిపారు.

కిటికీ ఊచలు తీసి దొంగతనం

ఖలీల్‌వాడి: నగరంలోని మహాలక్ష్మి కాలనీ నాగటవర్స్‌లో ఉంటున్న బేవసాని విఠల్ ఇంట్లో దుండగులు కిటికీల ఊచలు తీసి దొంగతనం చేసినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. విఠల్ తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రాత్రి నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని రాత్రి రెండు గంటల ప్రాంతంలో గదిలో నిద్రపోయారు. దుండగులు పక్క రూమ్‌లో ఉన్న కిటీకల ఊచలు తొలగించి లోపలికి ప్రవేశించారు. ముందుగా కుటుంబ సభ్యులు పడుకున్న రూమ్‌కు గొళ్లెం పెట్టి చోరీకి పాల్పడ్డారు. బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.12 తులాల బంగారం, 30 తులాల వెండి దొంగతనం చేశారు. ఆదివారం ఉదయం 7 గంటల ప్రాంతంలో పాలు పోసే అతను రావడంతో విషయం గమనించి డోరు తీశారు. విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పైపు లైన్‌కు లీకేజీలు.. వృథాగా నీరు..



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి పోచంపాడ్‌కాలనీకి నీటిని సరఫరా చేసే పైపు లైన్‌కు లీకేజీలు ఏర్పడటంతో నీరు వృథాగా పోతుంది. లీకేజీల గురించి పట్టించుకోకుండా నీటిని అలానే సరఫరా చేస్తున్నారు. దీంతో నీరు మొత్తం రోడ్లపై ప్రవహిస్తుంది. ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలో ప్రాజెక్ట్ నుంచి సిమెంట్ పైపులు వేశారు. ప్రస్తుతం ఆ పైపులకు లీకేజీలు ఏర్పడ్డాయి. వర్షకాలం కావడంతో తాగునీరు కలుషితమవుతుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



భరోసా లేని గీతన్నల బతుకు

- వృత్తిలో అడుగడుగునా జీవన్మరణమే..
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలంటున్న గీత కార్మికులు
- నేడు గీత కార్మికుల ఆరాధ్య దైవం సర్దార్ పాపన్నగౌడ్ జయంతి

డిచ్‌పల్లి: పొట్టకూటి కోసం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని తాటి చెట్లు ఎక్కి కల్లు గీస్తూ జీవించే గీత కార్మికుల జీవితాలు ప్రమాదకరం. వారి గీత మార్చేందుకు ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా లిక్కర్, శీతల పానీయాలు, విదేశాల నుంచి ఇబ్బడి ముబ్బడిగా రావడంతో గీత కార్మికులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వాటి ధాటికి తట్టుకోలేక కల్లు అమ్మకాలు పడిపోయాయి. ఫలితంగా వృత్తిలో సరైన ఉపాధి దొరకక బతుకుతెరువు కోసం ఇతర పనులు వెతుక్కుంటూ పట్టణాలకు, గల్ఫ్ దేశాలకు వలస బాటపడుతున్నారు. మరో పక్క వృత్తిలో ప్రమాదాలు జరిగి పెద్ద సంఖ్యలో వికలాంగులు అవుతుండగా మరికొందరు చనిపోతున్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు తూ..తూ మంత్రపు చర్యలు చేపడుతున్నాయి. నేడు గీత కార్మికుల ఆరాధ్య దైవం సర్దార్ పాపన్న



గౌడ్ జయంతి సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

ప్రభుత్వ పథకాలు ఎన్ని ఉన్నా..

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో దాదాపు 18 వేల మంది గీత కార్మికులు ఉన్నారు. ప్రభుత్వ పథకాలు ఎన్ని ఉన్నా వారి దరికి చేరడం లేదు. దీంతో వారు వేదనాభరిత జీవితాలను అనుభవిస్తున్నారు. 50 ఏళ్లు పైబడిన గీత కార్మికులకు ఆసరా పింఛన్ ఇస్తున్నారు. గీత కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రమాద బీమా ఇస్తున్నారు. కానీ రియల్ ఎస్టేట్ వ్యాపార ఫలితంగా ఎక్కడికక్కడ ఈత, తాటి చెట్లు నరికేస్తున్నా.. ప్రభుత్వం ఎలాంటి చర్యలను తీసుకోవడం లేదు. ఫలితంగా గీత కార్మికులకు ఉపాధి లేకుండా పోతోంది. జీవో నంబర్ 560 ప్రకారం ప్రతి గ్రామంలో ప్రభుత్వ భూమి ఉంటే 5 ఎకరాలు ఈత వనాలకు ఇవ్వాలని మార్గదర్శకత్వాలు ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదు. కల్లులో అనేక పోషకాలు ఉన్నాయని జాతీయ పోషకాహార సంస్థ తెలిపింది. క్యాన్సర్ లాంటి రోగాలు రాకుండా నివారించవచ్చని, కిడ్నీలో రాళ్లను తొలగిస్తుందని అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ప్రముఖ వైద్యులు చెబుతున్నారు. దీనిని ప్రభుత్వమే ప్రచారం చేయడం వల్ల కల్లుకు మార్కెట్ పెరుగుతుంది. తద్వారా గీత కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అయితే ప్రభుత్వం నుంచి ఆశించినంత సహకారం ఉండడం లేదు. అలాగే ఎత్తైన తాటి చెట్టుని ఎక్కాలంటే మోకు, ముస్తాదు పైనే ఆధారపడాల్సి వస్తుంది. దీంతో ఎక్కువ మంది గీత పనులకు దూరమవుతున్నారు. కల్లుగీత కార్పొరేషన్ నుంచి వృత్తిదారులకు సరైన రుణాలు కూడా లభించడం లేదు.

ప్రమాదాలు, మరణాలు అధికమే..

ఏ కుల వృత్తికి లేని ప్రమాద సమస్యలు గీత వృత్తికి ఉండటంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన ఆవశ్యకత ఉంది. అలాగే గౌడ యువతకు కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం రుణాలు అందించాలని కార్మికులు కోరుతున్నారు. అందుకు తగిన బడ్జెట్ మంజూరు చేయడంతో పాటు కార్పొరేషన్‌కు తగిన సిబ్బందిని కేటాయించి బలోపేతం చేయాలి. రాష్ట్రంలోని గీత కార్మికులకు ప్రభుత్వమే ప్రమాద బీమా పాలసీ చేస్తున్నా, సహజ మరణాలకు ఇవ్వడం లేదు. గీత కార్మికుల సహజ మరణాలకు కూడా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. ఏడాదిలో ఆరు నెలలే వృత్తి ఉంటుంది. మిగతా కాలం ఇతర పనులు చేసి బతికేందుకు ప్రతి గీత కార్మిక కుటుంబానికి రుణాలు ఇవ్వాలి. ఈత, తాటి చెట్లను నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా కొత్త చట్టం తీసుకురావాలి. గ్రామాల్లో ఉన్న బెల్ట్ షాపులను తొలగించి తరతరాలుగా అభివృద్ధి చేస్తూ జీవనం సాగిస్తున్న గీత కార్మికుల ఉపాధికి భద్రత కల్పించాలి.

పరికరాలు అందించాలి



గీత కార్మికుల వృత్తి ప్రమాదకరమైనది. తాటి చెట్లు ఎక్కేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ పరికరాలు అందించాలి. గీత కార్మికుల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వ సహకారం ఉండాలి.

– మహేందర్ గౌడ్, గౌడ యువసేన మండల అధ్యక్షుడు, జక్రాన్‌పల్లి

గ్రంథాలయాల సేవలను మెరుగుపర్చేందుకు కృషి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి

బోధన్: జిల్లాలో గ్రంథాలయ శాఖలను పటిష్టం చేసి పాఠకులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. ఈ క్రమంలోనే గ్రంథాలయ శాఖలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటైన సాలూర మండల కేంద్రంలో నూతనంగా గ్రంథాలయ శాఖ ఏర్పాటు కోసం కొత్త భవన నిర్మాణానికి గ్రామస్తులు ఎంపిక చేసిన స్థలాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ అల్లె జనార్దన్, గ్రామపెద్దలతో కలిసి పరిశీలించారు. కొత్త భవనం నిర్మాణం అయ్యే వరకు సహకార సంఘం కోసం ఇటీవల కొత్తగా నిర్మించిన రెండు గదుల భవనాన్ని పరిశీలించారు. అనంతరం అయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



సాలూరలో భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి

ఆదేశాల మేరకు స్థల పరిశీలన చేసినట్లు పేర్కొన్నారు. సాలూరలో గ్రంథాలయ కొత్త భవన నిర్మాణానికి రూ. 35 లక్షలతో ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే సహకార సంఘం భవనంలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఆయనను గ్రామపెద్దలు సన్మానించారు. విశ్రాంత హెచ్‌ఎం ఇల్తెపు శంకర్, ఎత్తిపోతల పథకం కమిటీ చైర్మన్ శివకాంత్ పటేల్, సొసైటీ సీఈవో బస్వంత్‌రావు పటేల్, గ్రామ పెద్దలు కేజీ గంగారాం, లక్ష్మణ్ గౌడ్, కన్నె రమేశ్, సాక్యం రవి తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



తెయూ (డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో అనలాగ్ ఐఏఎస్ అకాడమీ ప్రత్యేక కోచింగ్ సెంటర్ త్వరలో ప్రారంభమవుతుందని యూనివర్సిటీ బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు శ్రీను రాథోడ్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం యూనివర్సిటీలో ఆవిష్కరించారు. ఉద్యోగాలకు ప్రిపేరయ్యే వారి కోసం అనలాగ్ ఐఏఎస్ అకాడమీ హైదరాబాద్ ప్రత్యేక కోచింగ్ నిర్వహిస్తుందన్నారు. నిరుద్యోగులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూనివర్సిటీ విద్యార్థులు రాము, సచిన్, శివరాం, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ లేకుండానే పనులు..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో జాతీయ రహదారి 44 విస్తరణ పనుల్లో ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండానే పనులు చేపడుతున్నారు. దీంతో పని చేసే కూలీలు ప్రమాదాల బారిన పడుతున్నారు. వారం రోజుల క్రితం పనుల్లో భాగంగా ఎలాంటి సేఫ్టీ లేకుండా పైపులైన్ పనులు చేస్తుండగా మట్టి పెల్లాలు కూలి ఇద్దరు కూలీలు మట్టిలో కూరుకుపోయారు. అందులో ఒకరు మత్యువాత పడ్డారు. అయినా అధికారుల్లో మాత్రం చలనం లేకుండా పోతోంది. ఆదివారం కూడా పనులు సేఫ్టీ లేకుండానే చేపడుతున్నారు. రోడ్డు పక్కనే కందకంలో పనులు చేపడుతుంటే రోడ్డుపై నుంచి భారీ వాహనాలు వెళ్తుంటే భూమి కదులుతోంది. ఫలితంగా మట్టి కందకంలో కూలుతుంది. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టి పనులు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



జాతీయ రహదారి విస్తరణ పనుల్లో రక్షణ చర్యలు చేపట్టకుండా చేపడుతున్న పనులు

నూత్‌పల్లిలో స్వయంభూ శివలింగం



నూత్‌పల్లి శివారులోని రాజరాశ్వేర స్వామి ఆలయం (ఇన్‌సెట్లో) ఆలయంలోని శివలింగం

మీకు తెలుసా?

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని నూత్‌పల్లిలో స్వయంభూ లింగ క్షేత్రం ప్రత్యేక చరిత్రను సంతరించుకుంది. ఈ ఆలయంలోని శివలింగం పశువుల పేడ కింద వెలిసినట్లు,గుడిలోని నంది ఎగిరి వచ్చినట్లుగా గ్రామస్తులు పేర్కొంటున్నారు.

- ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతానికి ఆనుకున్న ఉన్న ఈ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని 150 ఏళ్ల క్రితమే రాతితో నిర్మించారు.
- వందల ఏళ్ల క్రితం చంద్రయ్య మహారాజ్ అమ్మమ్మ ఒకనాడు పిడకల కోసం పశువులు ఉండే ఊరి కొండ ప్రాంతానికి వెళ్లింది. ఆమె పేడను తీసే క్రమంలో శివలింగం బయటపడింది. విషయం తెలుసుకున్న చంద్రయ్య మహారాజ్ ఆ ప్రదేశాన్ని శుద్ధి చేసి గుడిని నిర్మించారు.
- రాజరాజేశ్వర స్వామిపై చంద్రయ్య భజన, కీర్తనలు రచించి గ్రామగ్రామాన సంచరించి భక్తి ప్రచారం చేసి, శివుడిలో ఐక్యమైనట్లు స్థలం పురాణం ఉంది. ఆయన సమాధి కూడా గుడికి కొద్ది దూరంలో ఉంది.
- చంద్రయ్య మహారాజ్ ఓ దొరగారింట్లో భక్తి, కీర్తనలు చేశారు. విని తరించిన దొర కానుకగా ఏమివ్వాలని చంద్రయ్యను అడిగారట. దొర ఇంట్లో ఉన్న నంది విగ్రహం కావాలని కోరారట. చంద్రయ్య నందిపై మంత్ర పుష్పాలు వేయగానే దానికి చలనం వచ్చి ఐదు మూరలు రంకెలు కొట్టి నూత్‌పల్లి శివాలయానికి ఎగిరి వచ్చినట్లు స్థల పురాణం.
- ప్రస్తుతమున్న నూత్‌పల్లి గ్రామానికి పురాతన ఆలయం ఐదు కిలో మీటర్ల దూరంలో ఉండగా, దీనిని ప్రతీకగా గ్రామంలోనే మరొక కొత్త గుడిని నిర్మించి అక్కడే ప్రతి ఏటా అక్టోబర్‌లో జాతర నిర్వహిస్తారు.

ఇందిరమ్మ ఇళ్లకు బిల్లుల చెల్లింపులు ఇలా..

సమాచారం



ఖలీల్‌వాడి: ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. ఐదు లక్షల నిధులు అందిస్తుంది. దీనిని నాలుగు విడతల వారీగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తుంది. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించే స్థలంలో ముగ్గు పోయగానే సంబంధిత అధికారులు కొలతలు వేసి ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇంటి యాప్‌లో ఫొటో తీసి జియో ట్యాగింగ్ చేస్తారు. ఆ తర్వాత విడతల వారీగా నిధులు మంజూరవుతాయి. అవేంటో తెలుసుకుందాం..

మొదటి విడత

ఇంటి బేస్మెంట్ నిర్మాణం పూర్తికాగానే మున్సిపల్ వార్డు ఆఫీసర్, గ్రామ పంచాయతీ స్థాయిలో సెక్రెటరీ ఇంటి వద్దకు వచ్చి పరిశీలన చేసి ఫొటో తీసుకుంటారు. దానిని సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేస్తే మండల ఏఈకి వెళ్తుంది. దీనిని ఏఈ నుంచి డీఈకి లాగిన్ అవుతుంది. డీఈ నుంచి పీడీకి చేరుతుంది. పీడీ కలెక్టర్ లాగిన్‌కు పంపిస్తారు. కలెక్టర్ పంపిన వివరాలు అన్ని పరిశీలించిన రూ. లక్ష నగదును లబ్ధిదారుని ఖాతాల్లో జమ చేస్తారు.

రెండో విడత

రెండో విడతలో మరో రూ. లక్ష మంజూరువుతుంది. ఈ నిధులు మంజూరు కావాలంటే స్లాబు వేసేంత ఎత్తు గోడలు నిర్మించాల్సి ఉంటుంది.

మూడో విడత

మూడో విడతలో మరో రూ. రెండు లక్షలు నిధులు మంజూరు అవుతాయి. దీని కోసం ఇంటి పైకప్పు సిమెంట్ స్లాబ్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఫీల్డ్ అధికారులు ఇంటిని పరిశీలించి ఫొటోలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.

నాలుగో విడత

ఇక నాలుగో విడతలో రూ. లక్ష మంజూరవుతుంది. ఈ నిధులు మంజూరు కావాలంటే ఇంటికి ప్లాస్టరింగ్, మరుగుదొడ్ల నిర్మాణం, ఇంటికి రంగులు వేసి ఉండాలి. అధికారులు అన్ని పనులు పూర్తయ్యాయా లేదా అని పరిశీలించి ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాత రూ. లక్ష నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయి.

చెరువు నిండదు.. పంట పండదు!

- సోన్‌పేట్ చెరువు దుస్థితి
- ఎగువనే ఎస్సారెస్పీ ఉన్నా అందని నీరు
- నీరు లేక సాగు చేయని వైనం

బాల్కొండ: తలపునే సముద్రం ఉన్నా తాగడానికి చుక్క నీరు పనికి రాదన్న చందంగా ఉంది మెండోరా మండలం సోన్‌పేట్ గ్రామస్తుల దుస్థితి. గ్రామ చెరువు వర్షపు నీటి ఆధారంగా నిండుతుంది. ప్రస్తుతం చెరువు సగం మాత్రమే నిండింది. దీంతో పొలాలకు నీటి సరఫరా చేసేందుకు నిర్మించిన తూంకు నీరు అందడం లేదు. దీంతో చెరువు నీటి ఆధారంగా సాగు చేసే సుమారు 300 ఎకరాలు బీడుగానే ఉంది. వర్షాలు కురుస్తాయని పంటలు సాగు చేస్తామని ఆశతో రైతులు నారు పోశారు. కానీ నారు ముదిరి పోయింది. ప్రస్తుతం నీరు వచ్చినా నారు పనికి రాదని రైతులు పేర్కొంటున్నారు.

ఎగువనే ఎస్సారెస్పీ..

ఎస్సారెస్పీ గ్రామ చెరువుకు 300 మీటర్ల దూరంలోనే ఉంది. కానీ ప్రాజెక్ట్ నుంచి సోన్‌పేట్ చెరువుకు చుక్క నీరు రాదు. ప్రాజెక్ట్ నిర్మాణం కోసం సగం ఆ గ్రామ భూములేనే అప్పగించారు. కానీ ఆ గ్రామానికే ప్రాజెక్టు నుంచి చుక్క నీరు లేదు. ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేసే లక్ష్మికాలువ ఆధారంగా సుమారు 65 చెరువులను నింపుతారు. కానీ ఇక్కడ అలాంటి అవకాశం కూడా లేదు. బుస్సాపూర్ వరకు లక్ష్మి కాలువ నీరు సరఫరా అవుతుంది. అక్కడి నుంచి ఫీడర్ చానల్ నిర్మించి చెరువులకు నీటి సరఫరా చేపట్టవచ్చు. కానీ పాలకులు ఆ వైపుగా దృష్టి సారించడం లేదు. దీంతో సోన్‌పేట్ గ్రామస్తులు నీటి కొరతను ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సోన్‌పేట్‌లో నీరులేక సాగు చేయని భూములు

తిప్పలు పడుతున్నాం



చెరువు కింది ఆయకట్టుకు ఏటా నీటి కోసం తిప్పలు పడుతున్నాం. ప్రాజెక్ట్ నిర్మాణం కోసం సర్వం భూములను కోల్పోయినా మాకు మాత్రం చుక్క నీరు ప్రాజెక్ట్ నుంచి రావడం రాదు. వర్షం నీటిపైనే ఆధారం. చెరువులో నీరు లేక ఇప్పటి వరకు నాట్లు వేయలేదు. అధికారులు స్పందించాలి.

– ప్రకాశ్, మాజీ సర్పంచ్, సోన్‌పేట్

ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్‌కు మాతృవియోగం



లింబాద్రిని పరామర్శిస్తున్న రూరల్ మాజీ ఎమ్మెల్యే


సిరికొండ: రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ రిక్క లింబాద్రికి మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి రిక్క లక్ష్మమ్మ శనివారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందారు. స్వగ్రామం సిరికొండ మండలం రావుట్లలో ఆమె అంత్యక్రియలను ఆదివారం నిర్వహించారు. అంత్యక్రియల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మధుశేఖర్ తదితరులు పాడె మోసి లింబాద్రిని పరామర్శించారు. నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అంత్యక్రియల అనంతరం లింబాద్రిని పరామర్శించారు.

పంట రక్షణకు పాత చీరలు



బాల్కొండ: అడవి పందుల భారీ నుంచి మక్క పంటను కాపాడుకోవడానికి రైతులు నానా పాట్లు పడుతున్నారు. పాత చీరలను పంట చేనుకు రక్షణ కడుతున్నారు. మార్కెట్‌లో పాత చీరలను రూ.50 ఒక్కటి కొనుగోలు చేసి చీరలను చుట్టూ కంచె వేసినట్లు కడుతున్నారు. పంట రక్షణ కోసం రైతులకు అదనంగా ఖర్చు అవుతుంది. ప్రస్తుత సంవత్సరం మక్క పంటకు అడవి పందుల బెడద తీవ్రంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గడ్కోల్‌లో..



సిరికొండ: అడవి పందుల బారి నుంచి పంటను కాపాడుకోవడానికి అన్నదాతలు వివిధ ప్రయోగాలు చేస్తుంటారు. రాత్రి వేళల్లో మొక్కజొన్న చేనుపై దాడి చేయడానికి వచ్చే అడవి పందులకు బెదురుగా కనబడటానికి చేను చుట్టూ పాత చీరలను రక్షణగా కడుతున్నారు. సిరికొండ మండలంలోని గడ్కోల్, న్యావనంది, నర్సింగ్‌పల్లి, చీమన్‌పల్లి, తాళ్లరామడుగు గ్రామాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. అడవి పందుల నుండి కాపాడుకోవటానికి మొక్కజొన్న చేను చుట్టు పాత చీరలను బెదుర్లుగా వాడుతున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న మోర్తాడ్ ఉన్నత పాఠశాల 1980–81 బ్యాచ్ విద్యార్థులు

మోర్తాడ్/ నిజామాబాద్ అర్బన్: మోర్తాడ్ ఉన్నత పాఠశాలలో 1980–81కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 45 ఏళ్ల తర్వాత నాటి మిత్రులందరూ ఒకే చోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. నగరంలోని శ్రీముక్క అయోధ్యరామ్ విద్యానికేతన్‌కు చెందిన 1995–96 పదో తరగతి పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల వ్యవస్థాపకుడు ముక్త దేవేందర్ గుప్తా, ఉపాధ్యాయులు సందీప్ కులకర్ణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



1995–96 శ్రీముక్క అయోధ్యరామ్ స్కూల్ విద్యార్థులు..

క్రైం కార్నర్

మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



ఇందల్వాయి: మండలంలోని పలు గ్రామాల్లో దుండగులు శనివారం రాత్రి మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ కాయిల్స్‌ను ఎత్తుకెళ్లారు. నల్లవెల్లి శివారులో గ్రామానికి చెందిన వెంకట్ రెడ్డి, గన్నారం గ్రామానికి చెందిన సామల రాజేశ్, మెగ్యానాయక్ తండాకు చెందిన లంబాని రెడ్యా అనే రైతులకు చెందిన మూడు ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేశారు. ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు విషయం గమనించి లైన్‌మన్ నవీన్‌కి సమాచారం అందించారు. లైన్‌మన్ పంచనామా నిర్వహించి జరిగిన నష్టంపై పై అధికారులకు నివేదిక అందించారు. రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆయన తెలిపారు.

పిచ్చి కుక్కల దాడిలో ఆరుగురికి తీవ్ర గాయాలు



మద్నూర్(జుక్కల్): మండలంలోని పెద్దతడ్గూర్‌లో ఆదివారం పిచ్చికుక్కలు దాడి చేసిన ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలో నడుచుకుంటు వెళ్తున్న సంజయ్, విఠబాయి, అనిల్, దాదారావు, నారాయణ, గంగాధర్‌లపై పిచ్చి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో స్థానికులు గాయాలపాలైన వారిని మద్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని కనిపించిన వారందరిని గాయపరుస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

నవీపేట: చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటి మునిగి ఒకరు మృతి చెందిన ఘటన నవీపేట మండలం లక్ష్మాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మాపూర్‌కు చెందిన గుడిమెట్ల శంకర్(45) రెండు రోజుల క్రితం గ్రామ సమీపంలోని చింతల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం శంకర్ మృతదేహం లభ్యమైందన్నారు. మృతుడి కుమారుడు కార్తిక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రయాణం.. నరక ప్రాయం



మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద గుంతలో చేరిన వర్షపు నీరు

నిజామాబాద్ రూరల్: మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద ఏర్పడిన గుంతలు నరకప్రాయంగా మారాయి. ప్రమాదకరంగా ఏర్పడ్డ గుంతలతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసినప్పుడు గుంతల్లో నీరు చేరుతోంది. గమనించిన వాహనదారులు వాటిపై ప్రయాణించినప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాకుండా వాహనాలు దెబ్బతింటున్నాయి. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు



గుంతల్లో నిలిచిన వర్షపు నీరు